క్లుప్తంగా

వీధిదీపాలు వెలిగించాలని వినతి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న ధన్‌రాజ్ గౌడ్, వంశీధర్ రెడ్డి

తుర్కయంజాల్: సాగర్ రహదారిపై వీధి దీపాలు వెలిగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం ఇంజాపూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు గుండ్లపల్లి ధన్‌రాజ్ గౌడ్, బొక్క వంశీధర్ రెడ్డిలు బుధవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ గుర్రంగూడ చౌరస్తా నుంచి ఇంజాపూర్‌కు రోడ్డు మధ్యలో వీధి దీపాలు వెలగకపోవడం వల్ల తరుచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ఈ విషయంలో వెంటనే చర్యలు తీసుకోవాలని కమిషనర్ బి సత్యనారాయణ రెడ్డిని ఆదేశించారు.

బోరుమోటార్ల ఏర్పాటుకు చేయూత



కొత్తూరు: మండల పరిధిలోని తీగాపూర్ గ్రామంలో బోరు మోటార్ల ఏర్పాటుకు స్థానిక ఎమ్మెల్యే సుమారు రెండు లక్షలు ఆర్థికసాయం చేసినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి తెలిపారు. గ్రామ పంచాయతీ పరిధిలో నీటి సరఫరా చేసే బోర్లు తరచూ పాడైపోతుండడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి సాయం చేసినట్లు వివరించారు. దీంతో పలుచోట్ల బుధవారం కొత్త మోటార్లను బిగించి నీటి సరఫరాను పునరుద్ధరించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటర్మీడియట్‌లో గురుకుల హవా

- ప్రతిభ చూపిన ప్రభుత్వ కళాశాలలు, గురుకులాలు
- అత్యుత్తమ మార్కులతో మెరిసిన విద్యార్థులు



శరత్ 493/500



రాంచరణ్ 932/1000



తిరుపతి 971/1000

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో అగ్రగామిగా నిలిచారు. ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు సాటి లేరని నిరుపించారు. వారి ప్రతిభకు కొదవలేదని రుజువు చేశారు. పేద విద్యార్థులు సాధించిన ప్రతిభకు అందరూ శభాష్ అంటున్నారు. ప్రథమ సంవత్సరంలో సీఈసీ, ఎంఈసీ కోర్సుల్లో 58 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 46 మంది ఉత్తీర్ణత సాధించారు. 79 శాతం మంది ఉత్తీర్ణత సాధించగా వీరిలో ఎంఈసీ ప్రథమ సంవత్స రంలో పిల్లే దీపక్ 487, డి బాలదిత్యా 480, సీఈసీ మొదటి సంవత్సరంలో ఏ. శరత్ 493, జే సాయికిరణ్ 480, ద్వితీయ సంవత్సరం ఎంఈసీ, సీఈసీ కోర్సుల్లో 47 మంది పరీక్షలకు హాజరవ్వగా 37 మంది ఉత్తీర్ణత సాధించారు.ఎంఈసీ ద్వితీయ సంవత్సరంలో యు. రాంచరణ్ అత్యధికంగా 932 మార్కులు, హెచ్ యోనా 926, సీఈసీ ద్వితీయ సంవత్సరంలో జె.తిరుపతి 971, ఎం మహేష్ 964 మార్కులు సాధించి అగ్రస్థానంలో నిలిచారు. మంచి ఫలితాలు సాధించి కళాశాలకు మంచి పేరు తెచ్చిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ మెర్సీ విరోధిని అభినందించారు. హైదరాబాద్ రీజియన్‌లో ఆర్ట్స్ విభాగంలో టాప్‌లో ఇబ్రహీంపట్నం గురుకుల కళాశాల నిలిచిందని విరోధిని తెలిపారు .

సత్తాచాటిన మాడ్గుల విద్యార్థులు



సన్మానిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు శ్యామల దేవి

మాడ్గుల: ఇంటర్మీడియట్ బోర్డు విడుదల చేసిన ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మొదటి, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించి సత్తా చాటారని ప్రభుత్వ జూనియార్ కళాశాల ప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు. మాడ్గులలో ఎంపీసి విభాగంలో 470 మార్కులకు కెర్సా అశ్విని 461సాధించి ప్రథమ స్థానంలో నిలిచారని ప్రధానోపాధ్యాయురాలు శ్యామల దేవి తెలిపారు. ద్వితీయ సంవత్సరం బైపీసీలో 1000 మార్కులకు జెల్ల కిషోర్ 961 సాధించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం వారిని సన్మానించారు.

పేదింటి వివాహానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న ఇర్విన్ జిల్లా పరిషత్ ఉపాధ్యాయులు

మాడ్గుల: ఇర్విన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వాచ్‌మెన్‌గా పని చేసే లక్ష్మయ్య కూతురు వివాహానికి ఆ పాఠశాల ఉపాధ్యాయులందరూ అండగా నిలిచారు. బుధవారం అమ్మాయి పెళ్లి సందర్భంగా రూ. 1,25,000లు, చీర బహూకరించారు. అదే విధంగా నిర్మాణ్ ఆర్గనేజేషన్ సభ్యుడు నరేశ్ రూ. 25,000లు అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాణ్ ఆర్గనేజేషన్ సభ్యులు, ప్రధానోపాధ్యాయులు పర్వతాలు, ఉపాధ్యాయులు సుధారాణి, ముత్యాపు రెడ్డి, మొగులయ్య, రమణాచార్యులు, జగన్, అర్చన, మల్లేశ్, నాగేష్, మల్లేష్, అర్చన, సుజాత, శ్రీనివాస్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు సాయం..



మాదాయిపల్లిలో ఆర్థిక సహాయం అందజేసిన శ్రీనివాసుయాదవ్

తలకొండపల్లి: కళాకారులకు ప్రోత్సాహం అందించేందుకుగాను మాజీ ఎంపీపీ శ్రీనివాసుయాదవ్ ఆర్థిక సహాయం అందజేశారు. మండల పరిధిలోని మాదాయిపల్లిలో మూడు రోజులుగా ×శ్రీ మునిరంగ వీధి నాటకం⋆ చక్కగా ప్రదర్శించారు. బుధవారం శ్రీనివాసుయాదవ్, రూ. 5,000 ఆర్థిక సహాయాన్ని కళాకారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పరంజ్యోతి, యాదయ్య, రవి, ఎల్లయ్య, శ్రీశైలం, పరశురాములు, లక్ష్మయ్య, పర్వతాలు, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ విద్యార్థుల ప్రతిభ



మానస 463/470



వైష్ణవి 429/440



మనుశ్రీ 379/500



కె. కీర్తన 365/440



సందీప్ 459/470

యాచారం: గునుగల్ ఆదర్శ జూనియర్ కళాశాలలో ఫస్ట్ ఇయర్‌లో 55 శాతం, సెకండ్ ఇయర్‌లో 54 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ హిమీమా తెలిపారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో 93 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 51 మంది పాసైనట్లు ఆమె తెలిపారు. ఎంపీసీ ఫస్ట్ ఇయిర్‌లో బొల్లంపల్లి మానస 463 మార్కులు, బైపీసీ ఫస్ట్ ఇయర్‌లో వల్లపు వైష్ణవి 429, కారంటోత్ మనుశ్రీ 379 మార్కులు సాధించినట్లు ఆమె పేర్కొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

ఫస్ట్ ఇయర్‌లో 55 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 16 మంది పాసైనట్లు, సెకండ్ ఇయర్‌లో 55 మందికి గాను 28మంది పాసయ్యారు. బైపీసీ ఫస్ట్ ఇయర్‌లో కీర్తన 365 మార్కులు సాధించిందని పేర్కొన్నారు.

మంచాలలో 78శాతం ఉత్తీర్ణత

మంచాల: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫలితాల్లో 78 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎంఎల్‌టీలో కాట్రోత్ మంజుల 917, ఎంపీసీలో ఇంద్రోజ్ సింధు 873, బీపీసీలో ఎస్ సాయి తేజ 891, సీఈసీలో ఎండీ నదీమ్ 770 సాధించారు. మొదటిసంవత్సరం ఎంపీసీలో ఎ.అంజలి 384, బీపీసీలో ఎం శ్రీలక్ష్మి 323, సీఈసీలో పీ జ్యోతి 358, ఎంఎల్‌టీలో బీ శ్రావణి 420 సాధించారు. మంచి మార్కులు సాధించినందుకు సంతోషంగా ఉందని ప్రిన్సిపాల్ తిరుపతయ్య తెలిపారు.

ఆరుట్ల మోడల్ స్కూల్‌లో సత్తాచాటిన విద్యార్థులు ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 68 మందికి 53మంది ఉత్తీర్ణులయ్యారు. బీపీసీలో యమునా 930, ఎంపీసీలో అనుషా 927, మొదటి సంవత్సరంలో 68 మందికి 35మంది ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీలో బీ వేణు 400, సీఈసీలో పి. స్వాతి 387, బీపీసీలో కె నిఖిత 372 మార్కులు సాధించిన్నట్లు ప్రిన్సిపాల్ కళ్యాణ్ చక్రవర్తి తెలిపారు.

గౌరెల్లిలో..

అబ్దుల్లాపూర్‌మెట్: మేడ్చెల్ జిల్లా కీసరలోని తెలంగాణ గురుకుల కళాశాలలో చదువుతున్న గౌరెల్లి గ్రామానికి చెందిన గ్యార సందీప్ ఫస్టియర్ ఎంపీసీలో 459/470 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచాడు.

ఆమనగల్లు జూనియర్ కళాశాలలో..



రాజేశ్వరి 973/1000



మాన్విత 966/1000



కళ్యాణి 958/1000



సుమ 464/470

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 75 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ అనసూయ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 136 మందికి 103 మంది ఉత్తీర్ణులయ్యారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో ఎస్ రాజేశ్వరి 973 మార్కులు, మాన్విత 966, బైపీసీలో కళ్యాణి 958, అనూష 929, సీఈసీలో శివ 905, పూజ 905 సాధించినట్లు ఆమె వివరించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో సాయిసుమ 464, సానియా 426, బైపీసీలో చందన 388, సీఈసీలో మల్లేశ్ 441 మార్కులు సాధించినట్లు ఆమె తెలిపారు.

బీఎన్‌రెడ్డి నగర్: బీఎన్‌రెడ్డి నగర్‌లోని కృష్ణవేణి జూనియర్ కళాశాల విద్యార్థిని బోడ మధుశ్రీ ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 467 మార్కులు సాధించిదని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత



గౌరారంలో అభయాంజనేయస్వామి పూజలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



ధ్వజస్తంభ ప్రతిష్ఠలో పాల్గొన్న గ్రామస్థులు

ఆమనగల్లు: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి పేర్కొన్నారు. ఆకుతోటపల్లి గ్రామ పరిధిలో గౌరారం గ్రామంలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. మూడు రోజులుగా విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం వేదపండితులు మంత్రోచ్చరణల మధ్య అభయాంజనేయస్వామి, శ్రీ గణపతి, ధ్వజస్తంభ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారిలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రజలు దైవ కార్యాల్లో భాగస్వాములు కావాలని కోరారు. హోమాలు, యజ్ఞాలతో లోకకల్యాణం జరుగుతుందన్నారు. అనంతరం కసిరెడ్డి, ఆచారిలను ఆలయ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. మాజీ జెడ్పీటీసీలు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, హరిప్రసాద్, మాజీ సర్పంచ్ రజిత, ఎంపీటీసీ మంగమ్మ, టీడీపీ కల్వకుర్తి ఇన్‌చార్జి యాదీలాల్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు అర్జున్‌రావ్, ఆలయ కమిటీ కార్యదర్శి చిట్టిగోరి భాస్కర్‌రావ్, కోశాధికారి నిట్టె నారాయణ పాల్గొన్నారు.

దేవాలయ భూముల వేలం

కొందుర్గు: కొందుర్గు లక్ష్మినరసింహస్వామి దేవాలయానికి సంబంధించిన వ్యవసాయ భూములను మూడేళ్లపాటు కౌలుకు తీసుకొని సాగుచేసుకోవడం కోసం 27న వేలం వేయనున్నట్లు దేవాలయ కార్యనిర్వాహక అధికారి శ్రీనివాసశర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల రైతులు రూ.2వేలు దరావత్ చెల్లించి 27న ఉదయం 11 గంటలకు నిర్వహించే వేలంలో పాల్గొనాలని ఆయన సూచించారు.

చదువుతోనే గుర్తింపు

షాబాద్: చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని నాగర్‌గూడ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కవిత, గ్రామ సంఘం అధ్యక్షురాలు రావుల లక్ష్మి అన్నారు. బుధవారం మండల పరిధిలోని నాగర్‌గూడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకొని చదువులో రాణించాలని సూచించారు.

మట్టి దందా..!

ఇష్టారాజ్యంగా జేసీబీలతో తవ్వకాలు

- చెరువులను తలపిస్తున్న భూములు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న యంత్రాంగం



మట్టిని తవ్వడంతో చెరువులను తలపిస్తున్న టీఎస్‌ఐఐసీ పాలాలు

కొత్తూరు: ముడుపుల మాయ.. అధికారుల అలసత్వం కారణంగా మండలంలోని సిద్ధాపూర్ గ్రామంలో టీఎస్‌ఐఐసీ సేకరించిన విలువైన పొలాల్లోని మట్టి వ్యాపారులకు కల్పతరువులుగా మారుతున్నాయి. రెండేళ్ల క్రితం చదునుగా ఉన్న పొలాలు ప్రస్తుతం భారీ యంత్రాలతో మట్టి, మొరం తవ్వకాలు చేపట్టడంతో చెరువులుగా దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వం రైతుల నుంచి పొలాలు సేకరించిన తర్వాత వాటిపై పర్యవేక్షణ చేపట్టకపోవడంతో పలువురు మట్టి వ్యాపారులు యథేచ్ఛగా యంత్రాలతో మట్టి, మొరంను తవ్వి విక్రయిస్తున్నారు. గతేడాదిగా ఇక్కడ కోట్ల రూపాయాల విలువైన మట్టిని తవ్వి విక్రయించినట్లు సమీప గ్రామానికి చెందిన ఓ ప్రజాప్రతినిధిపై ఆరోపణలు గుప్పుమంటున్నాయి. అయినా సంబంధిత శాఖల అధికారులు పొలాల రక్షణకు చర్యలు చేపట్టడం లేదని స్థానికులు వాపోతున్నారు.

గత ప్రభుత్వం సేకరించిన భూములు..

మండలంలోని సిద్ధాపూర్ శివారులో 252, 278, 361 సర్వే నంబర్లలోని 330.34 ఎకరాల్లో ఉన్న ప్రభుత్వ, అసైన్డ్ భూములను గత ప్రభుత్వం అసైన్డ్ రైతుల నుంచి సేకరించి టీఎస్‌ఐఐసీకి బదలాయించారు. కాగా 330.34 ఎకరాల్లో 97.24 ఎకరాలు ప్రభుత్వ పొలం. మిగితాది 240 ఎకరాలు అసైన్డ్ పట్టాలు ఉన్న రైతులవి. దీనికి గాను అప్పటి ప్రభుత్వం లబ్ధిదారులుగా ఉన్న 245 మంది రైతులకు ఎకరానికి రూ.10లక్షల చొప్పున పరిహారం సైతం అందజేశారు.

జోరుగా దందా..

హైదరాబాద్‌కు అతి చేరువలో, అంతర్జాతీయ విమానాశ్రాయానికి కూతవేటు దూరంలో ఉన్న కొత్తూరు మండలం అన్ని రంగాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ఎప్పటికప్పుడూ కొత్త కొత్త పరిశ్రమలు, రియల్ వెంచర్లు, భారీ కట్టడాలు వెలుస్తున్నాయి. వీటి నిర్మాణానికి, చదును చేయడానికి వ్యాపారులకు భారీగా మొరం(మట్టి) అవసరం అవుతోంది. దీంతో వారు స్థానికంగా ఉన్న కొందరు మట్టివ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. వారు సమాచారం బయటకు వెళ్లనీయకుండా కొందరికి ముడుపులు ఇస్తూ ప్రభుత్వ భూముల్లో నుంచి మట్టిని తవ్వేకుందుకు వ్యాపారులకు సహకరిస్తున్నారు. పెద్ద పెద్ద యంత్రాలతో వ్యాపారులు మట్టిని తవ్వడంతో పరిశ్రమలు, ఇతర ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు అనువైన పొలాలు చెరువులు, గుంతలను తలపిస్తున్నాయి.

కరువైన పర్యవేక్షణ..

గత ప్రభుత్వం సిద్ధాపూర్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ ప్లాంట్లు, ఐటీ హబ్ ఏర్పాటు చేసే యోచనలో భూములను సేకరించింది. రైతుల నుంచి పొలాలను సేకరించిన తర్వాత టీఎస్‌ఐఐసీతో పాటు రెవెన్యూ అధికారులు ఆ పొలాలపై సరైన నిఘా పెట్టలేదు. నెలల తరబడి భారీ యంత్రాలతో పగలు, రాత్రి మట్టిని తవ్వుతున్నా అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా విలువైన భూములు పనికిరాకుండా పోతున్నాయి.



మామిడోని చెరువులో ట్రాక్టర్‌లో నింపుతున్న మట్టి (ఫైల్)

చర్యలు తీసుకుంటాం



సిద్ధాపూర్‌లో టీఎస్‌ఐఐసీకి కేటాయించిన పొలాల్లో గతంలో కొందరు మట్టి తవ్విన ఘటనలు ఉన్నాయి. దీంట్లో పలువురు వ్యక్తులపై కేసులు నమోదయ్యాయి. మారోమారు అక్కడ తవ్వకాలు చేపట్టినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటల్లో నుంచి కూడా అనుమతులు లేకుండా మట్టి, మొరంను తవ్వొద్దు. ఏక్కడైనా అక్రమంగా తవ్వకాలు చేపడితే ప్రజలు మాకు సమాచారం ఇవ్వాలి.

– రవీందర్‌రెడ్డి, తహసీల్దార్, కొత్తూరు

కార్మిక చట్టాలను కాపాడుకోవాలి

ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పర్వతాలు

కొత్తూరు: పాలకుల కారణంగా కోల్పోయిన కార్మిక చట్టాలను మేడే స్ఫూర్తితో తిరిగి సాధించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పానుగంటి పర్వతాలు కార్మికులకు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా పట్టణ సమీపంలోని నాట్కోఫార్మా ఆవరణలో ఆయన బుధవారం సీపీఐ మండల కార్యదర్శి షకీల్ ఆధ్వర్యంలో మే డే వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అనేక పోరాటాలు, బలిదానాలతో ఆనాడు కార్మికులు సాధించుకున్న 8 గంటల పనిదినాలు, కనీస వేతనాలు, బోనస్, ఈఎస్ఐ, పీఎఫ్ చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రస్తుతం నిర్వీర్యం చేస్తున్నాయని ఆరోపించారు. కేవలం కార్పొరేట్ సంస్థలకు మాత్రమే మేలు చేసేలా చట్టాలను సవరిస్తూ కార్మికులకు అన్ని రకాలుగా అన్యాయం చేస్తున్నాయని వివరించారు. చట్టాల సవరణతో కార్మికులకు కనీస వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్ అందడం లేదన్నారు. కార్మికుల శ్రమతో కోట్లు గడిస్తున్న యాజమాన్యాలు వారి సంక్షేమాన్ని మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వాల తీరుతో కార్మికులు పెరుగుతున్న నిత్యావసర ధరలతో రెండు పూటల కూడా సక్రమంగా తినలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. తమ హక్కుల సాధనకు కార్మికులు ఐక్యంగా ఉండాలని ఆయన కోరారు. అంతేకాకుండా మే డే వేడుకల్లో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు జంగయ్య, వెంకటేశ్ పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న పర్వతాలు, నాయకులు